క్లుప్తంగా

వైభవంగా శ్రీనివాసుని కల్యాణోత్సవం



మంగళసూత్రం చూపిస్తున్న అర్చకుడు

విజయనగరం టౌన్: స్థానిక టీటీడీ(తిరుమల తిరుపతి దేవస్థానం) కల్యాణ మండపం ఆవరణలో శ్రీనివాసుని(శ్రీవేంకటేశ్వరస్వామి) కల్యాణోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పీవీ నరసింహాచార్యులు పంచామృతాలతో స్వామి వారికి అభిషేకం చేసినానంతరం కల్యాణం చేశారు. స్వామి కల్యాణం తిలకించేందుకు భక్తులు పోటెత్తారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా చినఅప్పన్న



పూసపాటిరేగ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా మండలంలోని చింతపల్లికి చెందిన బర్రి చినఅప్పన్న నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. తనకు ఇచ్చిన ఈ పదవిని ఎంతో బాధ్యతగా నిర్వహిస్తానని, పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని చినఅప్పన్న తెలిపారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: స్థానియ అయ్యన్నపేట వద్ద ఉన్న సూర్య ఫంక్షన్ హాల్‌లో ప్రముఖ రచయిత్రి కోరుపోలు కళావతి రాసిన వికాస తరంగిణి అనే పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి రచయిత్రి కళావతి రచనను ప్రశంసించారు. బాల సాహిత్యంపై ఎనలేని మక్కువతో ఆమె రాసిన రచన బాలల అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామచంద్రమూర్తి, సాహితీవేత్తలు జీఎస్ చలం, దివాకర్, ప్రకాశరావు, బాలు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగుల ఆరోగ్యం తనిఖీ చేసి వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

విజయనగరం: స్థానిక అయ్యన్నపేటలోని నడక మైదానంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శిబిరానికి వచ్చిన వారికి వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేపట్టి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అంతకుముందు వాకర్స్ క్లబ్ ఉద్యమకారులు, పాస్ట్ ఇంటర్నేషనల్ సంస్థ అధ్యక్షుడు జీఎల్ తోష్నివాల్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణారావు, గౌరవాధ్యక్షుడు పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



రాంభట్లను సత్కరిస్తున్న కౌముదీ పరిషత్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: స్థానిక కొత్తపేట బుక్కా వీధిలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో సినారే ప్రత్యేక జయంతి సభ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుమల బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత, నంది పురస్కార గ్రహీత రాంభట్ల నృసింహశర్మ హాజరై, భళారే..సినీగీతాల సినారే అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం ఆయనను కౌముదీ పరిషత్ సాహిత్య సాంస్కృతిక సంస్థ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దవళ సర్వేశ్వరరావు, కార్యదర్శి మానాప్రగడ సాహితి, ఎ.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

భోగాపురం: స్థానిక జాతీయ రహదారిపై ఎస్‌ఐ పాపారావు ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు ఆదివారం చేపట్టారు. నిబంధనలు అతిక్రమిస్తూ అధిక లోడుతో వెళ్తున్న రెండు పిక్కలోడు లారీలను పట్టుకుని, కేసు నమోదు చేశారు. వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని సూచించారు.

నియోజకవర్గానికి పరిశ్రమలు తెస్తానన్నారు..ఏవీ?

- బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



నెల్లిమర్ల: సభలో ప్రభుత్వం, కూటమి నాయకుల తీరును ఎండగడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల: గెలిపిస్తే నియోజకవర్గానికి వంద పరిశ్రమలు తీసుకువచ్చి, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇస్తానని ఎమ్మెల్యే లోకం నాగమాధవి హామీ ఇచ్చారని, ఆమె తెచ్చిన పరిశ్రమలేవీ..ఎక్కడని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు ప్రశ్నించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా స్థానిక నగరపంచాయతీలోని జరజాపుపేటలో నగరపంచాయతీ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సముద్రపు రామారావు అధ్యక్షతన ఆదివారం జరిగిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, కూటమి ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు ప్రజలను మోసగిస్తున్న తీరును ఎండగట్టారు. విదేశాల్లో స్థిరపడిన వారిని మన నాయకులుగా ఎన్నుకుంటే మోసం పోవడం తప్ప మరేమీ ఉండదన్నారు. వారు గెలిస్తే ఇక్కడ.. గెలవకుంటే విదేశాలకు వెళ్లిపోతారని అటువంటి వారిని ఎప్పుడూ నమ్మవద్దన్నారు. నిత్యం జనం మధ్య ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం పరితపించే నాయకులను ఎన్నుకుంటేనే మన భవిష్యత్ బాగుంటుందన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే గారి గారడీ మాటలు నమ్మి ఎంతోమంది నిరుద్యోగ యువతీ యువకులు ఓటు వేసి మోసపోయారన్నారు. ఆమె వస్తే ఉద్యోగాలు వస్తాయని భావించారని, ఏ ఒక్కరికీ ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో బాధపడుతున్నారన్నారు. కూటమి నాయకుల మాదిరిగానే ప్రభుత్వం కూడా ప్రజలను మోసం చేస్తోందని, ఎన్నికల హామీలు విస్మరించి, కక్షపూరిత రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన అమ్మఒడి పథకానికి కాపీ పేస్ట్ పథకమైన తల్లికి వందనం పథకం ఆలోచన మంత్రి నారా లోకేష్‌దేనని ఆయన తండ్రి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. ఎన్నికలప్పుడు చంద్రబాబు, పవన్‌లు కూ టమిగా ఏర్పడి సూపర్ సిక్స్ పథకాల పేరు చెప్పి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారని, తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీలేవీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే అన్నీ అమలు చేసేశామని చెబుతూ జనాన్ని మరింత మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి పాలనలోని లోపాలను ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు పెట్టి, జైలుపాలు చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు మహిళలకు ఉచిత బస్సు, అన్నదాతకు సాగు సాయం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వంటివి ఇచ్చిందే లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి పథకానికి 67 లక్షల మంది విద్యార్థులు అర్హులుగా ఉంటే ఆ సంఖ్యను కూటమి ప్రభుత్వం 17 లక్షలకు కుదించిందన్నారు. తల్లికి వందనం పథకం డబ్బులు కూడా కొంతమందికి రూ.13 వేలు, మరికొంతమందికి రూ.10 వేలు, ఇంకొంతమందికి అస్సలు డబ్బులే పడలేదన్నారు. ఇంట్లో ఎంతమంది చదివిన పిల్లలుంటే అంతమందికీ ఇస్తామని గతంలో రిజిస్ట్రేషన్ అయిన పిల్లలకే పథకం ఇచ్చారని, ప్రతి పథకంలోనూ అర్హులకు మొండిచేయి చూపిస్తున్నారన్నారు. చాలామంది కూటమికి ఓటేసినందుకు ఇప్పుడు బాధపడుతున్నారన్నారు. పాలిచ్చిన ఆవును వదిలేసి తన్నించుకునే దున్నను తెచ్చుకున్నామని అంటున్నారన్నారు. కూటమి పాలనలో ప్రజలు మోసపోతున్న వైనాన్ని ఇంటింటికీ వివరించాలని పిలుపునిచ్చారు. అనంతరం కూటమి మోసాలపై వైఎస్సార్ సీపీ అధిష్టానం రూపొందించిన బ్రోచర్లను మాజీ ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగరపంచాయతీ పార్టీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకుడు మత్స సత్యనారాయణ, ఎస్సీ సెల్ నాయకుడు రేగాన శ్రీనివాసరావు, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు మద్దిల వాసు, నౌపాడ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, పోలుబోతు నారాయణమూర్తి, కనకల హైమావతి, చిక్కాల సంతోష్‌కుమార్, మజ్జి గణేష్, కోట్ల పైడినాయుడు, మహంతి అప్పలనాయుడు, పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్‌తో దుష్ట పాలన..



నెల్లిమర్ల రూరల్: చంద్రంపేటలో ఇంటింటికీ వెళ్లి బ్రోచర్ల ద్వారా ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ దుష్ట పాలన కొనసాగిస్తున్నారని కూటమి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ధ్వజమెత్తారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని టెక్కలి, చంద్రంపేట, గుషిణి గ్రామాల్లో ఆదివారం జరిగిన రచ్చబండ సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి, ప్రజలను చంద్రబాబు ప్రభుత్వం మోసగిస్తున్న తీరును వివరించారు. అలాగే వైఎస్సార్ సీపీ హయాంలోని పాలనకు, ఇప్పటి కూటమి పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను తెలియజేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఏ ఒక్క పథకమూ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, పైపెచ్చు తాము గొప్పగా పాలన చేస్తున్నట్లు.. పథకాలన్నీ అమలు చేసేసినట్లు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కనీసం కొత్త పింఛన్లు కూడా ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. ఎంతోమంది భర్తలను కోల్పోయిన భార్యలు వితంతు పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారని, మరెంతోమంది వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు పెన్షన్ ఇస్తే బాగుణ్ను అని ఆశగా చూస్తున్నారన్నారు. ఎప్పుడూ డైవర్షన్ పాలిటిక్స్ చేయడం, అక్రమ కేసులతో ఇతర పార్టీ నాయకులను వేధించడం, అడ్డొచ్చిన వారిని అంతం చేసే హత్యా రాజకీయాలను ప్రోత్సహించడమే కూటమి ప్రభుత్వం పని అయిపోయిందని మండిపడ్డారు. చంద్రబాబు పాలనలో ప్రజలు అడుగడుగునా దగా పడుతుంటే.. అన్యాయం జరిగితే ప్రశ్నిస్తామనే పవన్ కల్యాణ్ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. స్థానిక ఎమ్మెల్యే మాటలు కూడా కోటలు దాటాయని, చేతలు మాత్రం గడప కూడా దాటలేదని విమర్శించారు. ఎన్నికలకు ముందు ప్రజల కష్టసుఖాల్లో ఉంటామన్న ఆమె.. ఏదైనా కష్టం చెప్పుకుందామని ఆమె వద్దకు వెళదామంటే ఐదు ద్వారాలు దాటాల్సిన పరిస్థితి ఏర్పడిందని నియోజకవర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం, ఆ పార్టీ నాయకుల మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, సమయం చూసి వారే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు గదల సన్యాసినాయుడు, చిక్కాల సాంబశివరావు, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు మత్స సత్యనారాయణ, దంతులూరి గిరిబాబు, జమ్ము అప్పలనాయుడు, రేగాన శ్రీనివాసరావు, చనమళ్ల సూర్యనారాయణ, కర్రోతు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు ప్రోత్సహిస్తున్నారు..



నెల్లిమర్ల రూరల్: కొండగుంపాంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

నెల్లిమర్ల రూరల్: బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని రామతీర్థం, ఏటీ అగ్రహారం, దన్నానపేట, సీతారామునిపేట, గొర్లిపేట, కొత్తపేట, కొండగుంపాం, పూతికపేట, గరికిపేట, సారిపల్లి తదితర గ్రామాల్లో శనివారం రాత్రి 10 గంటల వరకు రచ్చబండ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు హాజరై, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వం ప్రజలను మోసగిస్తున్న తీరును, డైవర్షన్ పాలిటిక్స్‌ను, కుట్రపూరిత, హత్యా రాజకీయాలు ప్రోత్సహిస్తున్న విధానాన్ని ఎండగట్టారు. అలాగే నాటి వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి ప్రభుత్వ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల, నగర అధ్యక్షులు గదల సన్యాసినాయుడు, చిక్కాల సాంబ, నాయకులు మత్స సత్యనారాయణ, పతివాడ సత్యనారాయణ తదితరలుఉ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై పోలీసులకు ఫిర్యాదు

భోగాపురం: మండలంలో వరుస ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేశామని విద్యుత్ శాఖ ఏఈ మస్తాన్‌వలీ తెలిపారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గడిచిన వారం రోజుల్లో నందిగాంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, అక్కివరం జాతీయ రహదారి సమీపంలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలోని రూ.3 వేలు విలువ చేసే కాపర్(రాగి) కోసం రూ.లక్షల విలువైన ట్రాన్స్‌ఫార్మర్లు పట్టుకుపోతున్నారన్నారు. ఎస్‌ఐ పాపారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారన్నారు.

15 నుంచి డెంకాడలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'

డెంకాడ: మండలంలో ఈ నెల 15వ తేదీ నుంచి బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ అనే కార్యక్రమం చేపడుతున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్మునాయుడు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం 15న మండలంలోని చొల్లంగిపేట, డి.కొల్లాం, గుణుపూరుపేట, గుణుపూరు, డెంకాడ, సింగవరం, నాతవలస గ్రామాల్లోనూ, 16న డి.తాళ్లవలస, అమకాం, రఘుమండ, గొడిపాలెం, పేడాడ, గంట్లాం గ్రామాల్లో, 17న చింతలవలస, బొడ్డవలస, జొన్నాడ, ఆకులపేట, మోదవలస, కొండరాజుపేట, బంగార్రాజుపేట గ్రామాల్లో, 18న మోపాడ, గొలగాం, బంటుపల్లి, అక్కివరం గ్రామాల్లో జరుగుతుందన్నారు.

గ్రామాల్లో అపూర్వ స్పందన

నెల్లిమర్ల రూరల్: ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మోసాలను తెలియజేయడమే ముఖ్య ఉద్దేశంగా గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఊరూరా వెళ్లి, కూటమి మోసాలను ప్రజలకు తెలియజేస్తున్నారని, ఈ క్రమంలో నాయకులకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారన్నారు. ఇదే ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న అసంతృప్తిని తెలియజేస్తోందన్నారు. ప్రజలు కూడా చంద్రబాబు హయాంలో మోసపోతున్న విధానాన్ని గోడు రూపంలో వెల్లబుచ్చుకుంటున్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ సబ్‌స్టేషన్ పరిధిలోని పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, బొడ్డపేట, మధుపాడ, వల్లూరు గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ త్రినాధరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

• నగరం.. జలమయం!

విజయనగంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైన వాన 45 నిమిషాల పాటు ఏకధాటిగా కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై ఉధృతంగా ప్రవహించే వరదనీటికి కలువపువ్వు మేడ వీధిలోని మురుగుకాలువలు పొంగిపొర్లడంతో అక్కడి ఇళ్లల్లోకి మురుగు భారీగా చేరుకుంది. ఆ నీటిని బయట పారబోసేందుకు బాధిత ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఇదిలా ఉంటే కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్, దాసన్నపేట, సిటీ బస్టాండ్ రోడ్డు, సున్నంబట్టీ వీధి, వైఎస్సార్ నగర్ తదితర ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున వరద నీరు చేరడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిత్యావసరాల కొనుగోళ్లకు బయటకు వచ్చి ఆ మురుగులో నడిచి వెళ్లేందుకు కొంతమంది ఆసక్తి కనబరచలేదు.

–విజయనగరం, విజయనగరం గంటస్తంభం



కలువపువ్వు మేడ వీధిలో ఇళ్లల్లోకి చేరిన వర్షపునీరు



రోడ్డుపై నిలిచిన వరదనీరు



విజయనగరం గంటస్తంభం: వైఎస్సార్ నగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

అవయవదానానికి ముందుకురావాలి

విజయనగరం ఫోర్ట్: అన్ని దానాలలో కన్నా అవయవదానం చాలా గొప్పదని గ్రంథాలయ సేవా సంఘం కన్వీనర్ బి.రామభద్రరాజు అన్నారు. స్థానిక ఎం.ఆర్.కళాశాలలో అవయవదాత గండి పల్లవి జ్ఞాపకార్థం అవయవదానంపై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన అవయవదానం గొప్పతనాన్ని తెలిపారు. ప్రతిఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలని కోరారు. మనం చేసే అవయవదానం ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపుతుందన్న విషయాన్ని అందరూ గుర్తెరగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయికుమార్, గాంధీ బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా న్యామత్ షావలీ ఉరుసు మహోత్సవం



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మతపెద్దలు

విజయనగరం టౌన్: స్థానిక ఉల్లివీధిలోని హజరత్ సయ్యద్ న్యామత్ షావలీ ఔలియా బాబా ఉరుసు మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతినగర్‌లో చందనోత్సవం, ఊరేగింపు, బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దర్గా ఖాదిమ్ అబ్దుల్ ఖాదరీ మాట్లాడుతూ గత 52 ఏళ్లుగా బాబా ఉరుసు నిర్వహిస్తున్నామని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

వన్‌టౌన్ సీఐ బదిలీ

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్‌కు బదిలీ అయింది. ఆయన స్థానంలో చౌదరి కొత్తగా బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచిన శ్రీనివాస్‌ను ఆకస్మికంగా బదిలీ చేయడం వెనక పలువురు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బంగారం కేసులో పెద్దల మాటను ఆయన వినలేదన్న కారణంగానే ఆయనను బదిలీ చేసినట్లు నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి



విద్యార్థికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న ప్రొఫెసర్ రాంభట్ల వెంకటరావు, తదితరులు

విజయనగరం టౌన్: కాలానుగుణంగా మార్పు చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(గోవా) వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాంభట్ల వెంకటరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక రింగురోడ్డులోని జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ ఆవరణలో బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కార ప్రదాన మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. విద్యార్థులకు మార్కులే కాదు.. రిమార్కులు కూడా ప్రతిభకు గీటురాయన్నారు. ప్రపంచ సాంకేతిక పరిజ్ఞానంలో భారతీయుల ప్రతిభాపాటవాలకు మంచి గుర్తింపు ఉందన్నారు. బ్రాహ్మణ కుటుంబాల్లోని విద్యార్థుల చదువును ఇలా అవార్డులతో ప్రోత్సహిస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ఎల్‌కేజీ టు పదో తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షుడు డీవీ శ్రీకాంత్, అధ్యక్షుడు వీవీ రమణమూర్తి, ప్రోగ్రాం చైర్మన్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.